కూల్.. కూల్.. కుండలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు, పాత్రలు

భానుడు భగ్గుమంటున్నాడు. మండే ఎండలతో ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండలు తరుముకొస్తున్న తరుణంలో వేసవి ఉపశమనం కోసం చల్లని తాగునీటి కోసం జనం తహతహలాడుతుంటారు. పేదోడి ఫ్రిడ్జ్‌గా మట్టి కుండలకు డిమాండ్ ఉంది. అయితే చాలామంది ప్రకృతి ప్రేమికులు ఫ్రిడ్జిలో నీటి కంటే మట్టి కుండలో నీటినే తాగుతుంటారు. ఇది ఆరోగ్యానికి కూడా మంచిది కావడంతో కుండలకు గిరాకీ ఎక్కువ. ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో మార్కెట్‌లో మట్టికుండల విక్రయాలు ప్రారంభమయ్యాయి.

– నగరి

- మట్టితో తయారైన బాటిళ్లు, కూజాలు, టీ కప్పులు
- చూపరులను ఆకర్షిస్తున్న వినూత్న మట్టి పాత్రలు
- మట్టిపాత్రల్లో తాగే నీరే శ్రేయస్కరం అంటున్న వినియోగదారులు
- వేసవిలో ఊపందుకున్న కుండల వ్యాపారం

వినియోగదారులను ఆకర్షించడానికి మున్సిపల్ పరిధిలోని కుండల తయారీదారులు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ తయారుచేసే మట్టిపాత్రలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మట్టిపాత్రలను విక్రయాలకు ఉంచుతున్నారు. సాధారణంగా కుండలు, కొళాయిలు అమర్చిన కుండలు అమ్మే విక్రయదారులు ఈ వేసవికి సంథింగ్ స్పెషల్ అంటూ వినూత్న పాత్రలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

చూపరులను ఆకర్షిస్తున్న మట్టి పాత్రలు

నాడు మట్టికుండలు లేని ఇళ్లు ఉండేవి కావు. ప్రస్తుతం ఆధునిక మోజులో పడి ప్రజలు వీటికి స్వస్తి పలికారు. ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు దిశగా వెళ్లిపోయారు. దీంతో ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నవారు. మళ్లీ వెళ్లిన దారినే తిరిగి వస్తున్నారు. ఆరోగ్యాన్ని ప్రసాదించిన నాటి మట్టి పాత్రల కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో తయారీదారులు మట్టి పాత్రలకే ఆధునిక హంగులు దిద్దుతున్నారు. కుండలతోపాటు మట్టితో తయారు చేసిన రంగు, రంగుల బాటిళ్లు, గ్లాసులు, కూజాలు, టీకప్పులు, దోశ పెనుం, చపాతి పెనుం, పువ్వులు అలంకరించి పెట్టే తొట్టెలు, పూల కుండీలు విక్రయానికి ఉంచుతున్నారు. ఇవి చూపరులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. రోడ్డు పక్కనే ప్రదర్శనగా ఉంచిన మట్టిపాత్రలను చూసి ఆకర్షితులైన వారు వీటిని విరివిగా కొనుగోలు చేస్తున్నారు. కుండలు, మట్టి బాటిళ్ల పరిమాణం అనుసరించి ధర పలుకుతోంది.



మట్టితో తయారు చేసిన కూజాలు

చల్లని నీరు.. మట్టి పాత్రల ప్రత్యేకత

పలువురు వైద్యులు, ఆయుర్వేద నిపుణులు కుండనీరు తాగడంతో పలు ఉపయోగాలున్నాయని సూచిస్తున్నారు. మట్టిలో ఎన్నో మినరల్స్, సాల్ట్స్ ఉంటాయి. అలాగే అందులో ఎలక్ట్రోమ్యాగ్నటిక్ ఎనర్జీ దాగి ఉంటుంది. మట్టితో తయారుచేసిన కుండల్లో నీటిని నిల్వచేయడంతో ఆ గుణాలన్నీ నీటిలో చేరుతాయి. ఆ నీటిని తాగడంతో వేసవిలో మనం కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. డీహైడ్రేషన్‌ను చాలావరకు అధిగమించవచ్చు. దీంతో వినియోగదారులు వీటిపై మొగ్గుచూపుతున్నారు. కుండ కొనుగోలు చేస్తే ఫ్రిజ్, ఫిల్టర్ రెండూ కొనుగోలు చేసినట్టే అని తెలుపుతున్నారు. నీటిలోని మలినాన్ని లాగేసి స్వచ్ఛమైన నీటిని అందించడం మట్టిపాత్రల ప్రత్యేకత. బాటిళ్లు, కూజాల్లో పోసిన నీరు కొంత సేపటికి ఫ్రిజ్‌లో తీసిన బాటిళ్లలా చల్లగా మారుతున్నాయి.

వేసవి సీజన్ అమ్మకాలు బాగున్నాయి



మట్టిపాత్రల తయారీనే మా వృత్తి. దశాబ్ద కాలంగా వీటిపైనే ఆధారపడి బతుకుతున్నాం. ప్రస్తుతం వేసవికి చూపరులను ఆకర్షించే పాత్రలు చేయాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగా కొన్ని వినూత్న పాత్రలు ఇక్కడ తయారు చేశాం. కొన్నింటిని ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాం. నీళ్లు పోసి ఉంచే రంగు, రంగుల బాటిళ్లు, కూజాలు అందుబాటులో ఉంచాం. పలు ప్రాంతాల నుంచి వచ్చేవారు కొనుగోలు చేసుకుని వెళుతున్నారు. కొందరికి పాత్రలు అందుబాటులో లేకుంటే ఆర్డరుపై తయారుచేసి అందిస్తున్నాం. మట్టిపాత్రలు వాడకం ఆరోగ్యానికి మంచిదని పలువురు గ్రహిస్తున్నారు. దీంతో అమ్మకాలు పెరిగాయి.

– అముద, మట్టిపాత్రల తయారీదారు, టీఆర్ కండ్రిగ

క్లుప్తంగా

రోగులకు మెరుగైన సేవలు అందించండి



వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని ఎంపీపీ లత అన్నారు. సోమవారం సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో మండలానికి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆయన ఆశయాల మేరకు వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ల్యాబ్, ప్రసూతి వార్డును పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ లోకనాథనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పోక్సో చట్టం, బాలబాలికల ఎదుగుదలలో వచ్చే మార్పులపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాలికలకు విద్య ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి బాలిక విద్యలో రాణించడమే కాకుండా చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తుండాలని తెలిపారు. బాలికలకు వర్తించే చట్టాలపై అవగాహన కల్పించి వారిని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా బాలబాలికల ఎదుగుదలలో వచ్చే మార్పులపై, బాల్యవివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్లు

పాలసముద్రం: అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, సంగీత తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆధార్ ఫీడింగ్‌తో పాటు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా లబ్ధిదారులకు అందేలా చూడాలని తెలిపారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై ఫిర్యాదు

నగరి: గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారని మండలంలోని గుండ్రాజు కుప్పం దళితవాడకు చెందిన యువకులు తహశీల్దార్ ధనుంజయులుకు సోమవారం వినతిపత్రం అందించారు. గ్రావెల్ తరలింపును ఆపి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రావెల్ తవ్వకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ గ్రావెల్ తరలింపులకు అనుమతి ఉందని, జాతీయ రహదారి పనులకు వెళుతోందన్నారు. అయినా క్వారీని పరిశీలిస్తామని, పరిమితికి మించి తీస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ మంత్రి విస్తృత పర్యటన



సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: టీడీపీ నేతలు దాడి చేయడంతో గాయాలపాలైన ఎం.అగరం సర్పంచ్ సుధాకర్‌ను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. సోమవారం నగరి ఏరియా ఆస్పత్రికి చేరుకున్న ఆమె అక్కడ చికిత్స పొందుతున్న సర్పంచ్ సుధాకర్‌ను పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరాతీశారు. సుధాకర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడే చికిత్స పొందుతున్న మరికొందరిని కూడా ఆమె పరామర్శించారు. ఉన్నత వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాయకులకు పరామర్శ

నిండ్ర: మండల కేంద్రమైన నిండ్రలో వైఎస్ఆర్ సీపీ మండల పబ్లిసిటీ అధ్యక్షుడు శివలింగాచారి అనారోగ్యంతో ఉండడంతో ఆయన్ను సోమవారం మాజీ మంత్రి రోజా పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. చవరంబాకం దళితవాడలో నాయకుడి కుటుంబాన్ని, కర్పరవేడు సుధాకర్ తల్లి అనారోగ్యంతో ఉండడంతో వారి కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా పార్టీ కార్యదర్శి అనిల్, మండల పార్టీ కన్వీనర్ వేణురాజు, మండల నాయకులు గుణ, వీరయ్య, నామదేవరెడ్డి, మునికృష్ణారెడ్డి, సర్పంచ్ బాబురెడ్డి బసవయ్య, గోవిందమ్మ, దినకరన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆశీర్వాదం

విజయపురం: మండలంలోని పాన్నూరు రెయిన్‌బో చిల్డ్రన్స్ స్కూల్‌లో వైస్ ఎంపీపీ బాలాజీ కుమారుడు జోఫ్ షాన్స్ మొదటి సంవత్సరం పుట్టిన రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్కే రోజా చిన్నారిని ఆశీర్వదించారు.

మాజీ మంత్రి పరామర్శ

నగరి: వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడు బుజ్జిరెడ్డిని సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లిన మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు పండ్లు అందజేశారు. మాజీ మంత్రి వెంట ఆమె సోదరులు వై.రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ భార్గవి పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

నగరి: వైఎస్ఆర్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన మాజీ మంత్రి ఆర్కే రోజాను మండల అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా నియమితులైన ఎస్.ఉషా సత్కరించారు. సోమవారం మాజీ మంత్రి నివాసానికి వెళ్లిన ఆమె పూలదండలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నియోజకవర్గ మైనార్టీ వింగ్ అధ్యక్షుడు సలీం, కో–ఆప్షన్ మెంబర్ హమీద్, శక్తివేల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో రాష్ట్ర పబ్లిసిటీ కార్యదర్శిగా నియమితులైన విజయపురం మండలం, కోసలనగరం గ్రామానికి చెందిన కేవీ చంద్రశేఖర్‌రాజు మాజీ మంత్రి ఆర్కే రోజాను సత్కరించారు. ఈ కార్యకమంలో రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, కన్వీనర్ శివరాజు, నాయకులు గోపి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరాహార దీక్షలు

- ఆందోళన ఉధృతం చేస్తాం
- ప్రభుత్వానికి ఎన్ఎంయూ అల్టిమేటం



పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగుల నిరాహార దీక్షలు

పుత్తూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) ఆధ్వర్యంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సోమవారం నిరాహార దీక్షలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా స్థానిక ఆర్టీసీ డిపో ముందు గేట్ మీటింగ్ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరాహార దీక్షలకు దిగారు. జోనల్ మాజీ అధ్యక్షుడు డీవీఆర్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎంయూ పోరాటాన్ని దశల వారీగా ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్–2019ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను వెంటనే ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను అమలు చేయాలని కోరారు. గ్యారేజీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థాగత వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనారోగ్య ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలని, పారదర్శక బదిలీలను అమలు చేయాలన్నారు. డిపో ప్రెసిడెంట్ ఎస్.సుందరం, సెక్రటరీ ఎం.శివకుమార్, వి.దొరబాబు, కె.చెంగల్రాయులు, రఘుపతి, వెంకటముని, మణికంఠ నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

కిశోర వికాసంతో ఉజ్వల భవిష్యత్





మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి, జీడీనెల్లూరు: మాట్లాడుతున్న సీడీపీఓ వినతశ్రీ

పాలసముద్రం: యుక్త వయసులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోర వికాసం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ విద్యావతి, ఎంఈఓ గిరిజ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ బాల బాలికలలో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్యంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంట్లో వండే పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, ఏపీఎం కల్పలతరెడ్డి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

గంగాధర నెల్లూరు: బాల్య వివాహాలను అరికట్టాలని, కిశోర బాలికల భద్రతే దేశ భద్రతగా భావించాలని స్థానిక సీడీపీఓ వినతశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు సచివాలయ మహిళా పోలీసులు, వీవో లీడర్లు, విద్యాశాఖ సీఆర్పీలు, వెలుగు సీసీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బిందుమాలతి, సీహెచ్ఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ ధర్మేంద్ర, వెలుగు సీసీలు, పోలీస్ ట్రైనర్లు, సచివాలయ మహిళా పోలీసులు, విద్యాశాఖ సీఆర్పీలు పాల్గొన్నారు.

దారి ఆక్రమించారు సారూ..



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: మండలంలోని పాతపాళ్యం దళితవాడ గ్రామంలో 30 ఇళ్లకు దారి సౌకర్యం కల్పించాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ లోకనాథపిళ్లైకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి గ్రామకంఠంలో 6 అడుగుల వెడల్పుతో రహదారి సౌకర్యం ఉండేదని, గతంలో రెవెన్యూ, పోలీసులు అధికారులు జాయింట్ సర్వే చేసి ఈ భూమి గ్రామకంఠానికి చెందినదే అని నిర్ధారించి రహదారి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కానీ నేడు ఆ రహదారి కబ్జాకు గురైందని, మరోసారి సర్వే చేసి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 12, శ్మశానానికి దారి 01, భూసర్వే 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 02, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01 వంటి సమస్యలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

పెరుమాల్‌గుంట అన్యాక్రాంతం కాకుండా చూడండి



తహసీల్దార్‌కు వినతి ఇస్తున్న మహిళలు

కార్వేటినగరం: పెరుమాల్‌గుంటను సర్వే నిర్వహించి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఈడిగపల్లికి చెందిన మహిళలు సోమవారం తహసీల్దార్ నాగరాజుకు విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ ఈడిగపల్లి సమీపంలో కొల్లాగుంట లెక్కదాఖలాలో సర్వేనంబర్ 308/1లో 50 సెంట్ల విస్తీర్ణంలో పెరుమాల్‌గుంట (ప్రభుత్వ భూమి) ఉంది. అయితే కొంతమంది రైతులు ఆ గుంట పొరంబోకును ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. పెరుమాల్‌గుంటలో గ్రామానికి చెందిన కులదైవం ఉన్నట్లు తమ పూర్వీకుల కాలం నుంచి అమ్మవారికి మొక్కులు తీర్చుకునేవారన్నారు. అలాంటి గుంట ఇటీవల అన్యాక్రాంతం అవుతోందని తహసీల్దార్‌కు వివరించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పెరుమాల్‌గుంటను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణను తొలగించి సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ అవసరాల నిమిత్తం వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అందుకు తహసీల్దార్ కూడా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బంగారు భవిష్యత్



వేడుకల్లో అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు

వెదురుకుప్పం: పిల్లల బంగారు భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రాలు పునాదులు వంటివని కార్వేటినగరం సీడీపీఓ పద్మసునంద అన్నారు. సోమవారం వెదురుకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో వార్షిక వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక, మానసిక, సాంస్కృతిక, భావోద్వేగాభివృద్ధికి చెందిన అంశాలలో పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల దేహదారుఢ్యం మెరుగు పడేందుకు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్ల చేతిలో మద్యం

- పద్నాలుగేళ్ల బాలలు కూడా మద్యానికి బానిసలవుతున్న వైనం
- నరదాగా మొదలై.... అనారోగ్యం వరకు..
- కుమిలిపోతున్న తల్లిదండ్రులు
- దళిత కాలనీల్లో విరివిగా బెల్టు షాపులు





వడమాలపేటలో మద్యం షాపు పక్కనే దాబా, (ఇన్‌సెట్) యువత చేతిలో మద్యం బాటిల్

వడమాలపేట: మద్యం మహమ్మారి చిన్నాపెద్ద తేడా లేకుండా అందరినీ దెబ్బతీస్తోంది. దానికి ప్రధాన కారణంగా మద్యం విచ్చలవిడి కావడం. తాగే వారి సగటు వయసు కాల క్రమేణా 28 నుంచి 14 సంవత్సరాలకు పడిపోయినట్లు తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఒకప్పుడు ఎక్కడో నగరం, పట్టణాల్లో కనిపించే మందు సీసాలు ఇప్పుడు ప్రతి గల్లీలో కనిపిస్తున్నాయి. దీంతో పదో తరగతి వయసు... అంతకంటే తక్కువ నుంచే మద్యపానంపై ఆసక్తి చూపుతున్నారు. 1980లో మద్యం తాగేవారి సగటు వయసు 28 సంవత్సరాలు ఉంటే.. అది 2007 నాటికి 20కి తగ్గింది. ప్రస్తుతం టీనేజ్‌లోకి ప్రవేశిస్తూనే చాలామంది యువత దురలవాట్ల వైపు అడుగులేస్తున్నారు. సామాజికంగా, ఆరోగ్యపరంగా వ్యక్తులపై మాత్రమే కాదు... ఈ ప్రభావం కుటుంబాల పైనా పడుతోంది. పిల్లల భవిష్యత్తును తలచుకొని తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు.

ఎక్కడ పడితే అక్కడ మద్యం

తాగడం అనేది ఇటీవల కాలంలో లెక్కలు చూస్తే ఇప్పుడు కొంత ఎక్కువైనట్టుంది. ఇది కూడా భవిష్యత్‌లో ప్రమాదకరమైనది. ప్రతి ఊరులో అనుకూలంగా బెల్ట్ షాపులు, ఎక్కడ పడితే అక్కడ వైన్ షాపులు ఉంటున్నాయి. ఇందుకు తోడు అమ్మకాలు పెంచుకోవడానికి మద్యం దుకాణదారులు సిండికేట్‌గా మారి అన్ని పల్లెల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. విపరీతంగా తాగడంతో రోడ్డు ఘర్షణలు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ సరుకు అందుబాటులో ఉండడంతో యువకులు మద్యానికి ఆకర్షితులవుతున్నారు.

బార్లను తలపిస్తున్న దాబాలు

మద్యం షాపు పక్కన ఉన్న దాబాలు బార్లను తలపిస్తున్నాయి. ఉదయం 6 గంటల నుంచి 10 గంటలకు వరకు, అలాగే రాత్రి 10 నుంచి 12 గంటల వరకు దాబాల్లో మద్యం విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం మద్యం షాపు పక్కన ఎలాంటి దాబాలు నిర్వహించకూడదు. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల దాబాలో ఫుల్‌గా మద్యం తాగి ఇరు వర్గాలకు చెందిన యువకులు కొట్టుకొని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

రైతుకు వేధింపులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు



కృష్ణయ్య మామిడి తోటను పరిశీలిస్తున్న రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు(ఫైల్)

వడమాలపేట (విజయపురం): సర్వే పేరుతో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు తమను వేధిస్తున్నారని వడమాలపేట మండలం, సీతారామపురం గ్రామానికి చెందిన కృష్ణయ్య, మునిరామయ్య, జయరామయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లడుతూ సీతారామపురం పంచాయతీకి చెందిన స్థానిక టీడీపీ నాయకులు సుమారు 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ, అటవీ భూములను అక్రమించుకొని సాగు చేసుకొంటున్నారని, అయినా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు తమ పొలాలను ఇప్పటికే మూడు సార్లు పరిశీలించడం ఏమిటని వారు ప్రశ్నించారు. తనకు ఉన్నది ఒక ఎకరా మాత్రమేనని, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుల చేతిలో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ, అటవీ భూములు ఉన్నాయని ఆరోపించారు. వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమకు రాజకీయ ఒత్తిడి ఉందని, అందుకే పొలాలను పరిశీలిస్తున్నామని అటవీ శాఖ అధికారులు చెప్పడం బాధాకరం అన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే తమను వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.